సొంత భవనాలు కలేనా?

- మూసాపేటలో అద్దె, ఇతర భవనాల్లో ప్రభుత్వ కార్యాలయాలు
- అవస్థలు పడుతున్న ఉద్యోగులు
- ఏడేళ్లైనా మొదలుకాని స్థలాల ఎంపిక ప్రక్రియ
- కొత్త ప్రభుత్వం దృష్టి సారించాలని మండల ప్రజల విజ్ఞప్తి


ఆదర్శ రిసోర్స్ సెంటర్‌లో కొనసాగుతున్న రెవెన్యూ కార్యాలయం

అడ్డాకుల: మూసాపేట కొత్త మండలంలో ప్రభుత్వ కార్యాలయాలు అవస్థల మధ్యన కొనసాగుతున్నాయి. గత ప్రభుత్వ హయాంలో జిల్లాలు, మండలాల పునర్విభజనలో అడ్డాకుల మండలంలో మరో కొత్త మండలంగా మూసాపేటను ప్రకటించారు. 2016లో మూసాపేటను కొత్త మండలంగా ఏర్పాటు చేసినా నేటికి సొంత భవనాలను నిర్మించలేదు. కొత్త మండలం ఏర్పాటైన నాటి నుంచి అద్దె, ఇతర భవనాల్లో ప్రభుత్వ కార్యాలయాలను కొనసాగిస్తున్నారు. వాటిలో సరైన వసతులు లేక ఉద్యోగులు, పనులపై వచ్చే ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. 2016 అక్టోబర్ 11న కొత్త మండలంలో మండల పరిషత్ కార్యాలయం మినహా ఇతర అన్ని ప్రభుత్వ కార్యాలయాలు ఏర్పాటయ్యాయి. రెండేళ్ల తర్వాత మండల పరిషత్ కార్యాలయం కూడా ఏర్పాటైంది. కొత్త మండలంగా ఏర్పడి ఆరున్నరేళ్లు దాటినా ఇప్పటి వరకు కొత్త మండలంలో ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలు లేవు. ప్రభుత్వ కార్యాలయాల సముదాయం కోసం ఇప్పటి వరకు స్థలాల ఎంపిక ప్రక్రియను చేపట్ట లేదు.


నీటిపారుదలశాఖ భవనంలో పోలీస్ స్టేషన్

ఆదర్శలో రెవెన్యూ కార్యాలయం

2016 అక్టోబర్ 11న కొత్త మండలంగా మూసాపేట ఏర్పాటు కాగా రెవెన్యూ కార్యాలయాన్ని ఆదర్శ రిసోర్స్ సెంటర్‌లో ఏర్పాటు చేశారు. దాని పక్కనే ఉన్న నీటిపారుదలశాఖ అతిథి గృహంలో పోలీస్ స్టేషన్‌ను ప్రారంభించారు. ప్రస్తుతం ఈ రెండు కార్యాలయాలు అక్కడే కొనసాగుతున్నాయి. 2019 జూన్‌లో మండల పరిషత్ కార్యాలయాన్ని అడ్డాకుల నుంచి విభజించి మూసాపేటలో కొత్తగా ఏర్పాటు చేశారు. అప్పటి వరకు మూసాపేట గ్రామంలో కొనసాగుతున్న గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని ఖాళీ చేయించారు. అందులోనే మండల పరిషత్ కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. దానికి సమీపంలో ఉన్న రెండు గ్రామ పంచాయతీ దుకాణాలను ఖాళీ చేయించి అందులో గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని కొనసాగిస్తున్నారు. వ్యవసాయశాఖ కార్యాలయాన్ని ఆదర్శ రిసోర్స్ సెంటర్ వస్త్ర దుకాణంలో మొదట ఏర్పాటు చేశారు. తర్వాత మూసాపేటలో నిర్మించిన రైతు వేదికలోకి మార్చారు. గత ప్రభుత్వం ఆరున్నరేళ్లలో కేవలం ఒక్క ఎంఈఓ కార్యాలయానికి మాత్రమే సొంత భవనాన్ని నిర్మించింది.

కొత్త ప్రభుత్వమైనా దృష్టి సారిస్తుందా..?

గత ప్రభుత్వ హయాంలో ఏర్పడిన మూసాపేట మండలంలో కొత్త మండల కార్యాలయాల సముదాయం కోసం ఆరున్నరేళ్లు గడిచినా స్థలాల ఎంపిక ప్రక్రియను చేపట్ట లేదు. జాతీయ రహదారి పక్కన సంకలమద్ది గ్రామ పంచాయతీలోని బంగ్లగడ్డలో ఉన్న ఆదర్శ వద్ద రెవెన్యూ, పోలీస్ స్టేషన్‌లను కొనసాగిస్తున్నారు. మండల పరిషత్, విద్య, వ్యవసాయ కార్యాలయాలు మాత్రం మూసాపేట గ్రామంలో ఉన్నాయి. అరకొర వసతుల మధ్యన కార్యాలయాలు కొనసాగుతున్నాయి. కొత్త మండల కార్యాలయ సముదాయ నిర్మాణంపై కొత్త ప్రభుత్వం దృష్టి సారించాలని మండల ప్రజలు కోరుతున్నారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాలు మూసాపేటలోనే ఏర్పాటు చేయాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేస్తున్నారు. ఇదిలా ఉండగా మూసాపేట మండలంగా ఏర్పడినా ఇక్కడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లేదు. జానంపేటలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నడుస్తోంది. మూసాపేట మండల కేంద్రంలో మరో పీహెచ్‌సీని ఏర్పాటు చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు. అదేవిధంగా మండల పశువైద్యాధికారి మధుసూదన్ వేముల పశువుల ఆస్పత్రిలో పని చేస్తూ ఇక్కడ కూడా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. మండల పశువైద్యాధికారి కూడా మూసాపేటలో ఉండేలా చొరవ తీసుకోవాల్సిన అవసరముందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. ఇక్కడ ఉన్న పశువైద్య కేంద్రం శిథిలావస్థకు చేరి పనికి రాకుండా మారింది. దానికి కొత్త భవనాన్ని కూడా మంజూరు చేయాల్సిన అవసరముందంటున్నారు. కొత్తగా ఎమ్మెల్యేగా ఎన్నికైన జి.మధుసూదన్‌రెడ్డి ప్రభుత్వ కార్యాలయాలకు కొత్త భవనాలు మంజూరు చేయించే విధంగా కృషి చేయాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

క్లుప్తంగా

ఎన్టీఆర్ కళాశాలలో ఆహార మహోత్సవం



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ మహిళా డిగ్రీ కళాశాలలో శనివారం వాణిజ్యశాస్త్రం విభాగం ఆధ్వర్యంలో ఆహార మహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈమేరకు పలు ఆహార పదార్థాలకు సంబంధించి స్టాల్స్ ఏర్పాటు చేశారు. స్టాల్స్‌లో తయారీ, అమ్మకం తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించే విధంగా కార్యక్రమం సాగింది. స్టాల్స్‌ను ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్‌తో పాటు అధ్యాపకులు, ఇతర విద్యార్థులు సందర్శించారు.

పోలింగ్ స్టేషన్ల పరిశీలన



దేవరకద్ర: నియోజకవర్గ కేంద్రంలోని పోలింగ్ స్టేషన్లను డీఆర్‌డీఏ నరసింహులు శనివారం పరిశీలించారు. దేవరకద్ర పట్టణానికి సంబంధించిన మోడల్ పోలింగ్ స్టేషన్‌ను ఆయన పరిశీలించి వచ్చేనెలలో జరిగే పార్లమెంట్ ఎన్నికలకు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. పోలింగ్ స్టేషన్లలో మెరుగైన సౌకర్యాలు కల్పించాలని, దివ్యాంగులు, వృద్ధులు నేరుగా వెళ్లి ఓటు హక్కు వినియోగించుకునే విధంగా ప్రత్యేక సిబ్బందిని, వీల్‌చైర్‌లను ఏర్పాటు చేయాలని సూచించారు. తాగునీరు, విద్యుత్ సౌకర్యం, వైద్య సేవలు అందుబాటులో ఉండేలా చూసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాసరావు, ఎంపీఓ శ్రీనివాస్ రెడ్డి, ఈవో సీత్యానాయక్ పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



జడ్చర్ల టౌన్: పట్టణంలోని వాసవీకమాన్ వద్ద ఆర్యవైశ్యసంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని శనివారం ప్రారంభించారు. వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ మేడిశెట్టి రామకృష్ణ, మంచనగణేష్‌ల సహకారంతో చలివేంద్రం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘాల నాయకులు చంద్రశేఖర్, దాచని చంద్రయ్య, కండెకృష్ణ, వెంకటేశ్, ప్రదీప్, రాఘవేందర్‌లు పాల్గొన్నారు.

బీజేపీ ఇంటింటి ప్రచారం



మిడ్జిల్: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో శనివారం మండల కేంద్రంలో బీజేపీ నాయకులు అభ్యర్థి డీకే అరుణను గెలిపించాలని ఇంటింటి ప్రచారం నిర్వహించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్ మాట్లాడుతూ కేంద్రంలో మోదీ చేపట్టిన సంక్షేమ పథకాలను చూసి ప్రజలు పార్టీని మరోసారి గెలిపించాల్సిన అవసరముందన్నారు. బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు తిరుపతి, ఆంజనేయులు, అరవింద్, శ్రీను, జంగిలయ్య, భాస్కర్ పాల్గొన్నారు.

సదస్సుకు తరలిరండి

జడ్చర్ల టౌన్: జిల్లా కేంద్రంలో ఆదివారం జరిగే మాదిగ ఉపకులాల పార్లమెంట్ స్థాయి సదస్సుకు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ రానున్నారని జిల్లా అధికార ప్రతినిధి వినోద్ మాదిగ శనివారం తెలియజేశారు. సదస్సుకు జిల్లాలోని ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ, ఎమ్మెఎస్ఎఫ్, వీహెచ్‌పీఎస్‌తో పాటు అనుబంధ సంఘాల సభ్యులు అందరు హాజరుకావాలని కోరారు.

పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



హన్వాడ: కేంద్రప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం మండలకేంద్రంలో కార్యకర్తల సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి... బీజేపీ అభ్యర్థిపై చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండించారు. కేంద్రంలో మళ్లీ బీజేపీ వస్తుందని అన్నారు. మండల అధ్యక్షుడు వెంకటయ్య, పార్లమెంటరీ ప్రభారి రాజన్న, అసెంబ్లీ ప్రభారి రాజేందర్‌రెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ అంజన్న, జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అక్కసుతోనే డీకే అరుణ విమర్శలు



స్టేషన్ మహబూబ్‌నగర్: పాలమూరులో సీఎం రేవంత్‌రెడ్డి సభ విజయవంతం కావడంతో అక్కసుతోనే డీకే అరుణ విమర్శలు చేస్తున్నారని టీపీసీసీ అధికార ప్రతినిధి కల్వ సుజాత ఆరోపించారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ భిక్షతో ఎదిగిన ఆమె అహంకారపూరితంగా మాట్లాడుతున్నారని ఆరోపించారు. మహిళల దాడులు జరుగుతుంటే ఒక్కరోజైనా మాట్లాడారా అంటూ ప్రశ్నించారు. నరేంద్రమోదీ తెలంగాణలకు చేసిందేమిలేదన్నారు. సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మాజీ రాధా అమర్, నాయకురాలు బెక్కరి అనిత, ఎస్సీసెల్ పట్టణ అధ్యక్షుడు నాగరాజు, సేవాదళ్ ప్రతినిధి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వంశీచంద్‌రెడ్డిని పార్లమెంట్‌కు పంపిద్దాం

స్టేషన్ మహబూబ్‌నగర్: కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న విద్యావంతుడు వంశీచంద్‌రెడ్డిని పార్లమెంట్‌కు పంపిద్దామని టీపీసీసీ అధికార ప్రతినిధి హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ కళాశాలలో పనిచేస్తున్న అధ్యాపకులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. పార్లమెంట్ వ్యవస్థపై పూర్తి అవగాహన ఉండి, నిత్యం ప్రజల్లో ఉండే నాయకుడిగా గుర్తింపు ఉన్న వంశీచంద్‌రెడ్డిని ఎంపీగా గెలిపించుకుంటే ఎంతో మేలు జరుగుతుందన్నారు.

ఘనంగా నాభిశిల ప్రతిష్ఠాపన



గండేడ్: సల్కర్‌పేట్‌లో నాభిశిల ప్రతిష్ఠాపన మహోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. అదేవిధంగా ఆంజనేయ స్వామి ఆలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠ, నాగుల ప్రతిష్ఠ కార్యక్రమాలు చేపట్టారు. శుక్రవారం నుంచి ఉత్సవాలు ప్రారంభం కాగా శనివారం ఉదయం ప్రాతఃకాల పూజ, అంకురార్పణ, గణపతి హోమం, నవగ్రహ, సుదర్శన హోమం, మూలమంత్ర హోమం, ధాన్యాధివాసం, హారతి మంత్రపుష్పం తీర్థ ప్రసాదాల వితరణ గావించారు. హోమంలో గ్రామానికి చెందిన పలువురు దంపతులు పాల్గొన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జితేందర్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్రీనివాస్, పీఏసీఎస్ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, ఎంపీటీసీ వెంకటేశం, మాజీ ఎంపీటీసీ రేణుక, మాజీ సర్పంచ్ ఊశన్న, లింగం, ఆశిరెడ్డి, బసప్ప తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

అడ్డాకుల: మండలంలోని కందూర్‌కి చెందిన సాయన్న అనారోగ్యంతో మరణించారు. కాగా బాధిత కుటుంబాన్ని బీజేపీ జిల్లా నాయకుడు మున్నూర్ రమేష్ శనివారం పరామర్శించారు. అంత్యక్రియల ఖర్చుల కోసం రూ.5వేల ఆర్థికసాయం అందజేశారు. మాజీ ఉప సర్పంచ్ శంకర్ తదితరులు ఉన్నారు.

ప్రజాపాలనపై ఎమ్మెల్యే దృష్టి పెట్టాలి


మాట్లాడుతున్న ప్రణీల్ చందర్, అభిమన్యూరెడ్డి

రాజాపూర్: ప్రజా పాలనపై జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి దృష్టిపెట్టాలని.. వ్యక్తిగత ఆరోపణలు చేయడం తగదని దోండ్లపల్లి ఎంపీటీసీ సభ్యుడు అభిమన్యూరెడ్డి, సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రణీల్‌చందర్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. బాలానగర్‌లో సర్వే నంబర్118లో గంగోజి పేర ఉన్న భూమిని అన్ని విధాలుగా లీగల్‌గా ఉన్నందుకునే అక్కడ భూమి కొనుగోలు చేసి వెంచర్ ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. వాస్తవాలు తెలుసుకోకుండా అధికారులపై ఒత్తిడి చేసి పట్టాదారును ఇబ్బందిపెట్టడం సరికాదన్నారు. సమావేశంలో నాయకులు వెంకటాచారి, రామకృష్ణగౌడ్, చెన్నారెడ్డి, శ్రీనివాస్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

విగ్రహం పెట్టొద్దంటూ పనుల అడ్డగింత


రెండు గ్రామాల ప్రజలను నిలువరిస్తున్న పోలీసులు

- ఇరుగ్రామాల మధ్య ఘర్షణ

గండేడ్: ఎండోమెంట్ భూమిలో విగ్రహం ఏర్పాటుపై రెండు గ్రామాలకు చెందిన వర్గాల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. వివరాలు ఇలా.. మండల కేంద్రంలో కమాన్ వద్ద ఆంజనేయ స్వామి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. కాగా ఇది ప్రధాన రహదారిని అనుకొని ఉంది. అయితే ఇటీవల ఈరోడ్డును జాతీయ రహదారిగా విస్తరిస్తున్నారు. అందులో భాగంగా చేసిన విగ్రహన్ని తీసివేయాల్సి వస్తోంది. దీంతో పక్కనే ఉన్న జంగంరెడ్డిపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయ భూమిలో సదరు విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని భావించారు. ఈ మేరకు గండేడ్ వాసులు పనులు ప్రారంభించారు. దీంతో జంగంరెడ్డిపల్లి వారు అభ్యంతరం వ్యక్తం చేశారు. శుక్రవారం తహసీల్దార్ నాగలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. అయినప్పటికీ శనివారం పనులు కొనసాగించడంతో జంగంరెడ్డిపల్లి వారు నాలుగైదు ట్రాక్టర్లలో అక్కడికి చేరుకొని పిల్లర్లకోసం ఏర్పాటు చేసిన డబ్బాలను తీసివేసి పనులను అడ్డుకున్నారు. అంతకుముందే గండేడ్ వారూ ఎక్కువ మొత్తంలో అక్కడ ఉండడంతో ఇరు వర్గాల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. ఒకరినొకరు తోసుకున్నారు. దీంతో మహమ్మదాబాద్ ఎస్ఐ శేఖర్‌రెడ్డి, హన్వాడ ఎస్ఐ వెంకటేశ్‌లు సిబ్బందితో అక్కడికి చేరుకుని వారిని వారించి తహసీల్దార్‌తో మాట్లాడారు. ఎండోమెంట్ డివిజన్ ఇన్‌స్పెక్టర్ వీణ, అధికారి ప్రసాద్ నిర్మాణానికి అనుమతి లేదని తెలిపారు. ఫోన్‌లో ఎండోమెంట్ కమిషనర్‌తో తహసీల్దార్ నాగలక్ష్మితో మాట్లాడించారు. చివరకు అధికారులందరూ కలిసి కొంత సమయం తీసుకుందామని.. నామినేషన్ల ప్రక్రియ ముగియగానే ఈనెల 26న నిర్ణయం తీసుకుందామని ఇరు గ్రామాల వారికి సూచించారు. అప్పటి వరకు పనులు చేపట్టరాదని తెలిపారు. దీంతో ఇరుగ్రామాల వారు అక్కడి నుండి వెళ్లిపోయారు.

బహుజనుల రాజ్యాధికారమే లక్ష్యం



మాట్లాడుతున్న హన్మేష్

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): బహుజనుల రాజ్యాధికారమే లక్ష్యంగా ముందుకు పోతున్నామని ఎంపీ అభ్యర్థిగా ముదిరాజ్, ఇతర ప్రజా సంఘాలు బలపర్చిన హన్మేష్ ముదిరాజ్ అన్నారు. శనివారం స్థానిక ప్రెస్‌క్లబ్ ఆయా సంఘాల నాయకులతో కలిసి సమావేశం నిర్వహించారు. అగ్రవర్ణాల పెత్తనంలో బహుజనులకు రాజకీయ ప్రాధాన్యత లేకుండా పోతోందన్నారు. అందుకే పాలమూరులో బహుజనులు బలపరిచిన అభ్యర్థిగా పోటీ చేయనున్నట్లు తెలిపారు. పండుగ సాయన్న సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణ ముదిరాజ్ తమ సామాజిక వర్గాన్ని సీఎం రేవంత్‌రెడ్డి అవమానించారని ఆరోపించారు. ప్రస్తుతం ప్రధాన పార్టీలన్నీ అగ్రవర్ణాలకే అవకాశం ఇచ్చాయని.. ఎన్నికల్లో ఆ పార్టీలకు బుద్ధిచెప్పాల్సిన అవసరం ఉందన్నారు. రాఘవేంద్ర, బస్వరాజు, శివన్న, బాలచందర్, తిమ్మప్ప, శ్రీనివాసులు, రాము, కేశవులు, సాయికుమార్, అశోక్, రమేష్, నరేందర్, ముకుందమహారాజ్ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

భూత్పూర్: మండలంలోని ఎల్కిచర్ల గ్రామానికి చెందిన నర్సింహులు (35) శనివారం జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. ఎస్ఐ కథనం మేరకు నర్సింహులుకు అదే గ్రామానికి చెందిన శైలజతో 2008లో వివాహం జరిగింది. వివాహ సమయంలో నర్సింహులు అన్నదమ్ముల సమ్మతితో శైలజ పేరుపై ఎకరా భూమిని రిజిస్ట్రేషన్ చేయించారు. కాగా కొన్ని రోజులుగా అన్నదమ్ములు సదరు భూమిలో తమకు భాగం ఉందని ఇవ్వాలని నర్సింహులుపై ఒత్తిడి తెచ్చారు. గ్రామ పెద్దల సమక్షంలో మాట్లాడుతామని చెప్పడంతో మనస్తాపానికి గురైన నర్సింహులు శుక్రవారం తన వ్యవసాయ పొలంలో గుళికల మందు తాగాడు. కాగా చికిత్స నిమిత్తం కుటుంబ సభ్యులు 108 వాహనంలో జిల్లా ఆస్పత్రికి తరలించగా చికిత్సపొందుతూ మృతిచెందాడు. కాగా అతడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అంగరంగ వైభవంగా రథోత్సవం


ఈశ్వర వీరప్పయ్యస్వామి రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

దేవరకద్ర: మండల కేంద్రంలో ప్రసిద్ధి చెందిన ఈశ్వర వీరప్పయ్యస్వామి రథోత్సవం శనివారం తెల్లవారు జామున అంగరంగ వైభవంగా జరిగింది. స్వామి రథాన్ని పూలు మంగళతోరణాలతో విద్యుత్ దీపాల అలంకరించారు. తెల్లవారు జామున 5 గంటలకు ప్రారంభం అయిన ప్రత్యేక పూజలు అరగంట పాటు కొనసాగాయి. అనంతరం స్వామి ఉత్సవమూర్తిని ఉంచి భాజా భజంత్రీల మధ్య రథాన్ని వందలాది మంది భక్తులు లాగుతూ ముందుకు తీసుకువెళ్లారు. 6గంటలకు ప్రారంభం అయిన రథోత్సవం 7.30 గంటల వరకు కొనసాగింది.

స్వామి వారి ఊరేగింపు.....

రథోత్సవం అనంతరం పట్టణంలో స్వామి వారి ఊరేగింపు మధ్యాహ్నం వరకు నిర్వహించి చక్రస్నానం నిర్వహించారు. అనంతరం సాయంత్రం దేవాలయంలో డోలారోహణ కార్యక్రమం ఘనంగా జరిగింది. వేలాది మంది భక్తులు స్వామి వారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. వారం రోజులుగా కొనసాగిన ఉత్సవాలు, అఖండ భజనలు శనివారం రాత్రి ముగించారు.

మహిళా ఉపాధ్యాయులందరికీ క్యాన్సర్ స్క్రీనింగ్


శిబిరాన్ని సందర్శించిన డీఈఓ రవీందర్

జడ్చర్ల టౌన్: జిల్లాలోని మహిళా ఉపాధ్యాయులందరికీ కాన్సర్ స్క్రీనింగ్ చేయించేందుకు చర్యలు తీసుకుంటున్నామని జిల్లా విద్యాశాఖ అధికారి రవీందర్ స్పష్టం చేశారు. శనివారం పట్టణంలోని సత్యసాయి మందిరంలో జిల్లా విద్యాశాఖ, పిల్లల మర్రి సైన్స్ ఫోరం, సత్యసాయి సేవాసమితి సంయుక్త ఆధ్వర్యంలో హైదరాబాద్ యంఎన్‌యూ ఆస్పత్రి వైద్యులు నిర్వహించిన క్యాన్సర్ స్క్రీనింగ్ శిబిరంను ఆయన సందర్శించారు. ఇటీవల క్యాన్సర్ బారిన పడుతున్న మహిళల సంఖ్య పెరుగుతుందన్నారు. దానికి కారణం అవగాహనలోపం, సరైన స్క్రీనింగ్ లేకపోవటమేనన్నారు. తమ ఉపాధ్యాయులు అందరూ ఆరోగ్యంగా ఉండాలని, అందుకోసం జిల్లావ్యాప్తంగా ఉన్న వారందరికీ స్క్రీనింగ్ చేసేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. శిరంలో 200మందికి స్క్రీనింగ్ నిర్వహించారని తెలిపారు. స్థానిక ఎంఈఓ మంజులాదేవి, సీఎంఓ బాలు యాదవ్, ఏఎంఓ శ్రీనివాస్, ఎంఎన్‌యూ ఆస్పత్రి వైద్యురాలు పల్లవి, సిబ్బంది పాల్గొన్నారు.

సొంత గూటికి ఎంపీటీసీ సభ్యుడు

నవాబుపేట: మండల పరిధిలోని హజిలాపూర్ ఎంపీటీసీ సభ్యుడు అంబదాస్ ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి సమక్షంలో శనివారం బీఆర్ఎస్ నుంచి తిరిగి కాంగ్రెస్‌లో చేరాడు. కాగా అంబదాస్ గత ఏడాది కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లో చేరిన విషయం తెలిసిందే. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రాంచంద్రయ్య, ఎంపీటీసీ సభ్యుడు తులసీరాంనాయక్, అజహర్, వెంకటయ్య, ఆంజనేయులు, కుమార్, సత్యం, నర్సింహ, రాములునాయక్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి క్రికెట్ శిబిరం

జడ్చర్ల టౌన్: హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ సహకారంతో వేసవి క్రికెట్ శిబిరం స్థానిక మినీ స్టేడియంలో ఆదివారం సాయంత్రం ప్రారంభం కానున్నట్లు పీఈటీ మొయిన్ శనివారం తెలియజేశారు. శిబిరాన్ని మహబూబ్‌నగర్ క్రికెట్ అసోసియేషన్ నిర్వహిస్తుందని.. బాలురు, బాలికలకు శిబిరంలో శిక్షణ ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు.

వాటర్‌ఫిల్టర్ వితరణ

జడ్చర్ల టౌన్: మండలంలోని పెద్ద ఆదిరాల ప్రాథమిక పాఠశాలకు శనివారం శిక్షణ ఫౌండేషన్ నిర్వాహకులు స్టీల్ వాటర్ ఫిల్టర్‌ను వితరణ చేశారు. పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఫౌండేషన్ మెంటార్ హన్మంతు ఉపాధ్యాయులు, విద్యార్థులకు ఫిల్టర్‌ను అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం నర్సింహరావు, ఉపాధ్యాయులు సరస్వతి, నాగేంద్రకుమార్, గంగ పాల్గొన్నారు.

ముగిసిన వారోత్సవాలు

జడ్చర్ల: స్థానిక అగ్నిమాపక కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన వారోత్సవాలు శనివారం ముగిశాయి. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఫైర్ ఆఫీసర్ శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన

చిన్నచింతకుంట: మండల కేంద్రంలోని సాందీప పాఠశాల విద్యార్థులు శుక్రవారం వెలువడిన 5వ తరగతి గురుకుల ప్రవేశ ఫలితాల్లో 13 మంది అర్హత సాధించినట్లు యాజమాన్యం తెలిపింది. ఈ మేరకు శనివారం ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, గ్రామస్తులు విద్యార్థులను అభినందించారు. కరస్పాండెంట్ కాంతయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇసుక టిప్పర్ సీజ్

దేవరకద్ర: గూరకొండ సమీపంలోని కోయిల్‌సాగర్ వాగు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న టిప్పర్‌ను పోలీసులు పట్టుకుని సీజ్ చేశారు. శనివారం తెల్లవారు జామున వాగు నుంచి వస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నాగన్న తెలిపారు.

వాగులో గొడవ!

కాగా కోయిల్‌సాగర్ వాగులో కొంత గొడవ జరిగినట్లు సమాచారం. వాగులో ఒక వైపు నారాయణపేట జిల్లా మరికల్, ధన్వాడ పోలీస్‌స్టేషన్ లిమిట్స్ ఉండగా మరో పక్క మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర, చిన్నచింతకుంట పోలీస్‌స్టేషన్ లిమిట్స్ ఉన్నాయి. రెండు వైపుల ఉన్న పోలీసు స్టేషన్‌ల లిమిట్స్ పరిధిలో వాగు నుంచి రాత్రి వేళ టిప్పర్‌లు, ట్రాక్టర్‌ల ద్వార ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారు. అయితే శుక్రవారం రాత్రి గూరకొండ సమీపంలోని వాగులో రెండు వైపుల పోలీసులు దాడులు చేసినట్లు తెలిసింది. ఇసుక తరలింపు విషయంలో కొంత గొడవ జరిగినట్లు సమాచారం. ఎవరి మధ్య ఎందుకు గొడవ జరిగిందనే విషయం పూర్తిగా తెలియ రాలేదు.

మార్కెట్ బంద్

దేవరకద్ర: మార్కెట్ యార్డుకు మరోసారి రెండు రోజులు సెలవులు ఇచ్చారు. శనివారం దేవరకద్రలో ఈశ్వర వీరప్పయ్యస్వామి రథోత్సవం సందర్భంగా మార్కెట్‌కు సెలవు ఇవ్వడంతో మార్కెట్‌లో ఎలాంటి లావాదేవీలు జరగలేదు. కాగా ఆదివారం ప్రభుత్వ సెలవు కావడంతో తిరిగి సోమవారం మార్కెట్‌లో లావాదేవీలు జరిగే అవకాశం ఉంది.

వర్షంతో తడిసిన ధాన్యం బస్తాలు...

దేవరకద్ర మార్కెట్‌లో శుక్రవారం కొనుగోలు చేసి తూకాలు వేసిన వరి ధాన్యం బస్తాలు శనివారం తెల్లవారు జామున కురిసిన వర్షానికి కొంత మేర తడిసి పోయాయి. రైతులు అమ్మకాలు పూర్తి చేసుకోవడంతో కొనుగోలు చేసిన వ్యాపారులు తూకం వేసి లోడింగ్‌లు చేయక పోవడం వల్ల నష్టం జరిగింది. అదేవిధంగా కొందరు రైతులు మార్కెట్‌కు అమ్మకానికి తెచ్చిన ధాన్యం కుప్పలపై కవర్లు కప్పి నష్టం జరగకుండా కాపాడుకున్నారు.

ఉపాధికూలీల సమస్యలు పరిష్కరించాలి



నారాయణపేట రూరల్: ఉపాధిహామీలో పనిచేస్తున్న కూలీల సమస్యలు వెంటనే పరిష్కరించాలని ఏఐకేఎంఎస్ జిల్లా నాయకులు వెంకట్రాములు డిమాండ్ చేశారు. సింగారంలో శనివారం పనులు కొనసాగుతున్న ప్రాంతాలకు వెళ్లి కూలీలతో మాట్లాడారు. జాబ్‌కార్డులు ఉన్న ప్రతి ఒక్కరికీ 200 రోజులు పని కల్పించాలని, కూలీని రూ.600కి పెంచాలని డిమాండ్ చేశారు. నీడకోసం టెంట్లు, నీరు అందించాలన్నారు. పని ప్రదేశంలో మృతిచెందిన కూలీలకు రూ.10లక్షల బీమా అందించాలన్నారు.

నేలకొరిగిన వరి పంట


కోయిల్‌సాగర్ ప్రాజెక్టు సమీపంలో గాలిదుమారంతో నేలకు ఒరిగిన వరి పంట

దేవరకద్ర: మండలంలో గాలి దుమారం, కొద్దిపాటి వర్షంతో చేతి కొచ్చిన వరి పంటలు నేలకు ఒరిగాయి. దీంతో రైతులకు నష్టం వాటిల్లింది. ముఖ్యంగా మండలంలోని కోయిల్‌సాగర్, నాగారం, పెద్ద రాజమూర్ తదితర గ్రామాల పరిధిలో శనివారం తెల్లవారు జామున ఈదురు గాలులు వీచి వర్షం కురిసింది. దీంతో కోత దశకు వచ్చిన వరి పంటలపై ప్రభావం పడింది. అనుకోకుండా నష్టం జరగడంతో పలువురు రైతులు ఆవేదన చెందుతున్నారు. కాగా దాదాపు నాలుగు వందల ఎకరాల వరకు వరి పంటలకు కొంత మేర నష్టం జరిగినట్లు అధికారులు అంచనా వేశారు.

అధికారుల సందర్శన....

దేవరకద్ర మండల వ్యవసాయ అధికారి రాజేందర్ అగర్వాల్ సిబ్బందితో కలిసి పలు గ్రామాలను సందర్శించి నేలకు ఒరిగిన వరి పంటలను పరిశీలించారు. గాలి వీచడం వల్ల వరి పంటలు నేలకు పడ్డాయని ఆయన తెలిపారు. దీంతో ఒక శాతం వరకు వడ్లు నేలకు రాలాయని తెలిపారు. రైతులు నేలకు ఒరిగిన వరి పంటను జడలుగా కట్టుకోవాలని తద్వారా కొంతమేర నష్టం అరికట్టవచ్చని తెలిపారు.